విద్యార్థినిపై అసభ్యంగా ప్రవర్తించిన పిఇటిపై ఫిర్యాదు

ప్రజాశక్తి-మదనపల్లె

పదవ తరగతి విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించిన పిఇటిపై డిఇఒ, డివైఇఒలకు ఫిర్యాదు చేసినట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుబ్బారెడ్డి తెలిపారు. పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న ఓ విద్యార్థిని పట్ల ఆ పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు గోపీనాథ్ అసభ్యంగా ప్రవర్తించారని అమ్మాయి తల్లిదండ్రులు హెడ్మాస్టర్ సుబ్బారెడ్డికి ఫిర్యాదు చేశారు. గురువారం పిఈటిపై జిల్లా విద్యాశాఖ అధికారి, ఉప విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు హెడ్మాస్టర్ సుబ్బారెడ్డి తెలిపారు. విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు బాధ్యతాయుతంగా పనిచేయాలని కోరారు. ఘన చరిత్ర కలిగిన ఈ పాఠశాలలో విద్యార్థినిల పట్ల లైంగిక వేధింపులు, అసభ్య ప్రవర్తనలు ఆరోపణలు వస్తున్నాయని వీటిపై ఉపాధ్యాయులు బాధ్యత వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఇకపై ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని తెలిపారు. అనంతరం పిఈటి విద్యార్థి తల్లిదండ్రుల సమక్షంలో క్షమాపణ చెప్పడంతో వారు సర్దుకు పోయారు.

రైల్వే ప్రయివేటీకరణ ఆపాలి : సిఐటియు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

రైల్వే ప్రయివేటీకరణ ఆపాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సి.హెచ్.చంద్రశేఖర్ అన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సిఐటియు ఆధ్వర్యంలో గురువారం రైల్వేస్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మానిటైజేషన్ పేరుతో 35 నుంచి 99 ఏళ్ల వరకు దేశవిదేశీ కార్పొరేట్లకు కారు చౌకగా కేంద్రంలో బిజెపి ప్రభుత్వం లీజుఅగ్రిమెంట్లు, ప్రయివేటీకరణ చేస్తున్నారని దీన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని పేర్కొన్నారు. 8 యంత్రాల పరికరాలు ఉత్పత్తి చేసే ఫ్యాక్టరీలను, 50 శాతం రైల్వే స్టేషన్లను, 68 వేల కిలోమీటర్ల రైల్వేలైన్లను, 500 ప్రయాణికుల రైలును, 300 గూడ్స్ రైలను ప్రయివేటీకరణ చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. స్వాతంత్ర్య ఉద్యమం తర్వాత, రైల్వే ఏర్పాటుకు నాటి పెట్టుబడుదారులు ఎవరు ముందుకు రాలేదని తెలిపారు. రాష్ట్రంలో పనిచేస్తున్న 35 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలన్నారు. కేంద్రంలో బడ్జెట్ నిధులు కోత విధించారని, మేయింటెనెన్స్ లేక ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. నరేంద్ర మోడీ చేస్తున్న దుర్మార్గాలను ఎదిరించి పోరాడాలని, వచ్చే ఎన్నికల్లో బిజెపికి బుద్ధి చెప్పి గద్దె దింపాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే అన్ని రకాల ప్రభుత్వ సంస్థలు, గనులను, ప్రయివేట్ పరం చేశారన్నారు. ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పందికాళ్ళ మని మాట్లాడుతూ ప్రభుత్వ సంస్థలు పరిరక్షణ కోసం పోరాడి కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా కన్వీనర్ ఓబిలి పెంచలయ్య, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు మద్దిల ప్రసాద్, మండల ఉపాధ్యక్షులు లింగాల యానాదయ్య, కోశాధికారి, కరతోటి హరి నారాయణ, సహాయ కార్యదర్శి ముత్యాల శ్రీనివాసులు. ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు నాగిపోగు పెంచలయ్య, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘ నాయకులు సిహెచ్.హరిప్రసాద్, ఎం.సుబ్బరాయుడు, అంకయ్య, కె.కేశవులు, శివారెడ్డి, గొంజపల్లి ప్రభాకర్ పాల్గొన్నారు.

రైల్వేకోడూరు : రైల్వేస్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న సిఐటియు నాయకులు

పీలేరు: కేంద్ర ప్రభుత్వం భారతీయ రైల్వే ప్రయివేటీకరణ చేయాలనే నిర్ణయాన్ని ఉప సంహరించుకొని ప్రభుత్వరంగంలోనే ఉంచాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు తెలిపారు. సిఐటియు మండల కార్యదర్శి శంకర్ ఆధ్వర్యంలో పీలేరు రైల్వేస్టేషన్ ట్రాక్‌పై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వే అభివృద్ధికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. రైల్వేను ప్రయివేటీకరించడం ద్వారా సామాజిక భద్రతకు తూట్లు పొడవడమేనని సిఐటియు జిల్లా కార్యదర్శులు డి.భాగ్యలక్ష్మి, డి.వెంకట్రామయ్య, ఎస్.మెహరున్నీసా, ఎస్.ఓబులమ్మ పేర్కొన్నారు. రైల్వేలో అన్ని రకాల టికెట్ల ధరలు పెంచడం, వసతులు తగ్గించడం, ప్రజలపైనే భారాలు మోపడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కార్మికులు పురుషోత్తం, శంకరయ్య, నాగరాజు, ఇజ్రాయిల్, హరి ప్రసాద్, రసూల్ పాల్గొన్నారు.

పీలేరు : రైల్వే ట్రాక్‌పై నిరసన తెలుపుతున్న సిఐటియు నాయకులు

ఆడపిల్లలకు వరం కల్యాణమస్తు, షాదీతోఫా : కలెక్టర్

ప్రజాశక్తి - రాయచోటి

ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న వైఎస్ఆర్ కల్యాణమస్తు, షాదీ తోఫాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ గిరీష పేర్కొన్నారు. గురువారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీతోఫా కింద జూలై-సెప్టెంబర్, 2023 త్రైమాసికంలో వివాహం చేసుకున్న 10,511 మంది అర్హులైన లబ్ధిదారులకు రూ.81.64 కోట్ల ఆర్థిక సహాయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి బటన్ నొక్కి నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశారు. అన్నమయ్య జిల్లాకు సంబంధించి 342 మంది జంటలకు రూ.2.76 కోట్ల లబ్ధి చేకూరింది. కలెక్టరేట్‌లోని స్పందన వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి కలెక్టర్ గిరీష, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఉర్దూ అకాడమీ డైరెక్టర్ కలీం హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం పేద కుటుంబాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తోందని, ప్రతి పేద కుటుంబాలలోని వధువుల తల్లిదండ్రులను ఆర్థికంగా ఆదుకోవడం కోసం వైఎస్ఆర్ కల్యాణమస్తు, షాదితోఫా వంటి పథకాలను ప్రవేశపెట్టారన్నారు. అర్హులందరికీ పారదర్శకంగా అమలు చేస్తున్న పథకాలను ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, దివ్యాంగులు, భవన నిర్మాణ కార్మికుల కుటుంబాలలోని వారందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. అన్నమయ్య జిల్లాలోని 342 మంది అర్హులకు సంబంధించి రూ.2.76 కోట్ల మెగా చెక్కును కలెక్టర్ చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు.

లబ్ధిదారులకు మెగా చెక్‌ను అందజేస్తున్న కలెక్టర్ గిరీష

రాజంపేట అభివృద్ధి మరిచిన పాలకులు

- టిడిపి ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాజంపేట పార్లమెంటు పరిధిలో పాలకులు ఈ ప్రాంత అభివృద్ధిని మరిచారని పశ్చిమ రాయలసీమ శాసనమండలి సభ్యులు భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని చమర్తి జగన్మోహన్‌రాజు క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అన్ని పార్లమెంటు కేంద్రాలను జిల్లా కేంద్రం చేస్తామని ప్రకటించిన ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి రాజంపేటను మాత్రం విస్మరించారని పేర్కొన్నారు. రాజంపేటకు మంజూరైన వైద్య కళాశాల మదనపల్లికి తరలిపోవడం వెనుక ఎంపీ, ఎమ్మెల్యే, స్థానిక నాయకుల చేతగానితనం వలనేనన్నారు. మానవ తప్పిదం వలన అన్నమయ్య డ్యామ్ తెగి సుమారు 40 మంది జల సమాధి అవడమే కాక, వందల సంఖ్యలో పశు నష్టం, వేలాది ఎకరాలలో పంట నష్టం వాటిల్లిందని, కొందరి మృతదేహాలు వరదలలో కొట్టుకుపోయి సముద్రపాలై నేటికీ మృతదేహాలు ఆచూకీ లభ్యం కాలేదని పేర్కొన్నారు. ఇంతటి జలవిలయం సంభవించినా ముఖ్యమంత్రి వరద ప్రాంతాలలో పర్యటించి ప్రజలకు అనేక హామీలు గుప్పించి నేటికి రెండేళ్లు పూర్తయినా బాధితులకు పూర్తి సాయం అందించలేకపోయారని విమర్శించారు. 14 మునక గ్రామాలలో పునరావాసం కింద కనీసం ఇంటి కప్పు కూడా నిర్మించలేని దౌర్భాగ్యపు స్థితిలో ప్రభుత్వం ఉందని ఎద్దేవా చేశారు. వరదలలో మృతి చెందిన వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పిస్తామని చెప్పి కేవలం 7 నుంచి 8 మందికి మాత్రమే మంగంపేట మైనింగ్‌లో ఉద్యోగం కల్పించారని తెలిపారు. వేల ఎకరాలలో ఇసుక మేట వేస్తే తొలగించకపోగా రైతులు స్వచ్ఛందంగా మేటలు తొలగించుకుందామనుకున్నా ప్రభుత్వం సహకరించలేదని పేర్కొన్నారు. రెండు దశాబ్దాలలో ఈ ఏడాది అతి తక్కువ వర్షపాతం నమోదైందని, అన్నమయ్య డ్యాం నిర్మాణం చేపట్టకపోతే ప్రజలు మంచినీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని తెలిపారు. భూగర్భజలాలు తగ్గినప్పుడు ఎలాంటి కార్యాచరణ రూపొందించాలన్న ఇంకిత జ్ఞానం కూడా ప్రభుత్వానికి లేదని విమర్శించారు. సర్వజనాసుపత్రిలో టిడిపి హయాంలో ఏర్పాటు చేసిన డయాలసిస్ కేంద్రం ప్రస్తుత ప్రభుత్వంలో తుప్పుపట్టేలా చేసి మూలన పెట్టడంతో ఈ ప్రాంతంలోని వందలాదిమంది కిడ్నీ బాధిత రోగులు డయాలసిస్ కోసం ఇతర ప్రాంతాలకు తరలి వెళ్తూ నానా అవస్థలు పడుతున్నారని, వెంటనే డయాలసిస్ కేంద్రాన్ని పునఃప్రారంభించాలని డిమాండ్ చేశారు. దౌర్జన్యాలు, వేధింపులు, కక్షలు, కబ్జాలే ఎజెండాగా వైసిపి పాలన సాగుతోందన్నారు. ప్రభుత్వం అన్నమయ్య డ్యాం వరద బాధితులను ఆదుకొని వారికి తక్షణమే కావలసిన అన్ని మౌలిక వసతులు కల్పించాలని టిడిపి రాజంపేట పార్లమెంట్ అధ్యక్షులు చమర్తి జగన్మోహన్‌రాజు డిమాండ్ చేశారు. త్వరలోనే తెలుగుదేశం పార్టీ వరద బాధితులను ఆదుకునేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి పోరాడేందుకు ప్రణాళిక రూపొందించనున్నట్లు తెలిపారు.

జిల్లాలో ఆర్‌టిసికి పెరిగిన ఆదాయం

- బస్టాండ్లలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి
- జిల్లా ప్రజా రవాణా శాఖాధికారి రాము

ప్రజాశక్తి-పీలేరు

అన్నమయ్య జిల్లాలో రోడ్డు రవాణా సంస్థకు ఈ ఏడాది రూ.4 కోట్లు ఆదాయం పెరిగిందని జిల్లా ప్రజా రవాణా శాఖాధికారి రాము తెలిపారు. గురువారం ఆయన పీలేరు ఆర్టీసి బస్టాండ్, డిపోను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బస్టాండ్‌లో పెచ్చులూడుతున్న పైకప్పును, ప్రయాణికులు వచ్చి, వెళ్లే దారిని పరిశీలించారు. అనంతరం డిఎం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో గత సంవత్సరం అక్టోబర్ నాటికి రూ.170 కోట్లు ఆదాయం వచ్చిందని, ఈ ఏడాది అది రూ.174 కోట్లకు చేరుకుందన్నారు. ప్రజా రవాణా పరిధి గతంలో 57.40 లక్షల కిలోమీటర్లు కాగా, ప్రస్తుతం అది 54.10 లక్షల కిలో మీటర్లకు తగ్గిందన్నారు. ఇపికె కూడా 41.21 నుంచి 42.40 శాతానికి పెరిగిందని తెలిపారు. ఆర్టీసీ బస్సుల నిర్వహణలో మదనపల్లి-1 డిపో ప్రథమ, మదనపల్లి-2 డిపో ద్వితీయ, పీలేరు డిపో తృతీయ స్థానంలోనూ, రాజంపేట, రాయచోటి డిపోలు నాలుగు, ఐదవ స్థానాల్లో ఉన్నాయన్నారు. ఈ నెల తిరువన్నామలై గిరి ప్రదర్శనకు వెళ్లే భక్తుల కోసం జిల్లా నుంచి 35 ప్రత్యేక బస్సులు నడపాలన్నది లక్ష్యం కాగా ఇప్పటివరకు 23 బస్సులకు ప్రయాణికులు సీట్లు రిజర్వ్ చేసుకున్నారని పేర్కొన్నారు. శబరిమలైకు వెళ్లే అయ్యప్ప స్వామి భక్తులకు సౌకర్యంగా గత ఏడాది 30 ప్రత్యేక బస్సులు నడిపామని, ఈ సంవత్సరం 60 ప్రత్యేక బస్సులు నడపాలన్నది లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. ప్రయాణికులకు సౌకర్యంగా ఆర్టీసీ బస్టాండుల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం కృషి చేస్తున్నామన్నారు. పీలేరు డిపో పరిధిలోని కాలకాడలో 7 మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.8 లక్షలు నిధులు మంజూరయ్యాయన్నారు. త్వరలోనే పనులు ప్రారంభమవుతాయని తెలిపారు. పీలేరు ఆర్టీసీ బస్టాండులో పైకప్పు పెచ్చులు ఊడుతోందని, దీనివల్ల ప్రయాణికులకు కూడా ప్రమాదం ఉండవచ్చని దీని మరమ్మతులతో పాటు మరుగుదొడ్ల నిర్మాణానికి గతంలో పంపిన ప్రతిపాదనలను పునఃపరిశీలించాలని సంబంధిత అధికారులతో మాట్లాడామని పేర్కొన్నారు. త్వరలోనే తగిన పరిష్కారం లభిస్తుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. బి.కొత్తకోటలో ఆర్టీసీ డిపో పునఃప్రారంభానికి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీలేరు డిపో మేనేజర్ బండ్ల కుమార్, సిఐ సుబ్బమ్మ, ఆర్టీసి ఉద్యోగులు, కార్మిక నాయకులు, ప్రయాణికులు పాల్గొన్నారు.

బస్టాండ్‌లో పెచ్చులూడుతున్న సీలింగ్‌ను పరిశీలిస్తున్న రాము

సమయపాలన పాటించని బ్యాంకు సిబ్బంది

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

కడప రోడ్డులోని కెనరా బ్యాంకులో గురువారం మధ్యాహ్నం 2-45, 3 గంటల సమయంలో సిబ్బంది లేక వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని కాంగ్రెస్ పార్టీ రాజంపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి పూల భాస్కర్ ఆరోపించారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఆర్‌బిఐ విధి విధానాల ప్రకారం బ్యాంకు సిబ్బందికి భోజన విరామం అంటూ ఏమీ లేకపోయినప్పటికీ కొందరు సిబ్బంది వినియోగదారులకు అందుబాటులో లేరన్నారు. విద్యార్థులకు ప్రభుత్వం అందించే విద్యా దీవెన పథకానికి సంబంధించి లేనిపోని షరతులు విధించడం వలన విద్యార్థులు, తల్లిదండ్రులు రెండు వారాలుగా బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణాలు చేస్తున్నారని తెలిపారు. బ్యాంకు వారు సమయపాలన పాటించకుండా వినియోగదారుల పట్ల నిర్లక్ష్యం వహిస్తూ బ్యాంకుల చుట్టూ తిప్పుకుంటున్నారని ఆరోపించారు. విద్యా దీవెనకు సంబంధించి జాయింట్ అకౌంట్ చేసుకునేందుకు ఈ నెల 24 చివరి తేదీ కాగా బ్యాంకు సిబ్బంది నిర్లక్ష్యంతో, రాష్ట్ర ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో అనేకమంది విద్యార్థులు పథకానికి నోచుకోక దూరమయ్యే అవకాశం ఉందని ఆవేదన చెందారు. తల్లిదండ్రులు, విద్యార్థుల ఆవేదన విని బ్యాంకులలో పరిస్థితులు తెలుసుకునేందుకు గురువారం కెనరా బ్యాంక్ సందర్శించిన ఆయనకు సిబ్బంది లేక వినియోగదారులు పడుతున్న పాట్లు గమనించి సిబ్బంది నిర్లక్ష్యాన్ని తీవ్రంగా ఖండించారు.

స్టిక్కర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, జెసి

నేటి నుంచి కలామ్స్ విజన్-2023

ప్రజాశక్తి - రాయచోటి

పట్టణంలోని ఇంటర్నేషనల్ మెరిట్ హై స్కూల్‌లో శుక్రవారం నిర్వహించబోయే కలామ్స్ విజన్-2023 సైంటిఫికల్ ప్రాజెక్ట్ ఎక్స్‌పోను విజయవంతం చేయాలని కలెక్టర్ గిరీష పిఎస్, జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ తెలిపారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో ప్రోగ్రాం డైరెక్టర్ వినయ్‌కుమార్ రూపొందించిన కలామ్స్ విజన్ సైంటిఫికల్ ఎక్స్‌పో లోగోను వారు ఆవిష్కరించారు. విద్యార్థులలో శాస్త్రీయ ఆలోచనల పెంపొందించడానికి సైంటిఫికల్ ప్రాజెక్ట్ ఎక్స్‌పో ఉపయోగకరంగా ఉంటుందని తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా ఉండే హైస్కూల్ విద్యార్థిని విద్యార్థులు సద్వినియోగం చేసుకొని విజయవంతం చేయాలని ఆయన తెలిపారు. అనంతరం ప్రోగ్రాం డైరెక్టర్ వినయ్ కుమార్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉండే ప్రయివేట్, కార్పొరేట్ గవర్నమెంట్, విద్యార్థులు తమ ప్రాజెక్టులతో ప్రదర్శిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో సైంటిఫికల్ టెంపర్ మీద మ్యాజికల్ షో , అవగాహన సదస్సులు వీక్షించడానికి పాల్గొనే విద్యార్థుల కోసం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. కార్యక్రమానికి వచ్చే విద్యార్థుల కోసం పూర్తిస్థాయి ఏర్పాట్లు పూర్తి చేశామని వినయ్ తెలిపారు. కార్యక్రమంలో అన్ని పాఠశాలల విద్యార్థులు వచ్చి వీక్షించవచ్చని తెలిపారు.

గర్భిణులకు పండ్లు పంపిణీ చేస్తున్న మానవత సభ్యులు

గర్భిణులకు పండ్లు పంపిణీ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని డిబిఎన్ పల్లె ప్రాథమిక పాఠశాలలో గురువారం గర్భిణులు పండ్లు, విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ చేశారు. స్త్రీశిశు సంక్షేమ శాఖ సిడిపిఒ వై.సుధామణి, సూపర్వైజర్ సుబ్బలక్ష్మి ఆధ్వర్యంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు లయన్ అబ్దుల్లా, చైర్మన్ తుంగా వెంకటరమణారెడ్డి, డైరెక్టర్ వేణుగోపాలనాయుడు 25 మంది గర్భిణులు, 25 మంది విద్యార్థులకు పండ్లు, ప్లేట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిబిఎన్‌పల్లే పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటసుబ్బయ్య, అంగన్వాడీ కార్యకర్తలు మంజుల, శిరీష, ఐసిడిఎస్ సిబ్బంది రమేష్ పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాను క్షుణ్ణంగా పరిశీలించండి :'నల్లారి'

ప్రజాశక్తి-మదనపల్లె

ఓటరు జాబితాలోని పొరపాట్లను ప్రతి టిడిపి కార్యకర్త క్షుణ్ణంగా పరిశీలించాలని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక టిడిపి కార్యాలయంలో టిడిపి, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. జనసేన, టిడిపి కార్యకర్తలు మదనపల్లి నియోజకవర్గంలో ఓటర్ల జాబితాలో ఉన్న అవకతవకల గురించి శుక్రవారం ఎన్‌విఆర్ కల్యాణ మండపంలో జరగనున్న సమావేశంలో చర్చించామన్నారు. కార్యక్రమంలో జనసేన ఉమ్మడి చిత్తూరు జిల్లా కార్యదర్శి జంగాలశివరాం, గ్రానైట్ బాబు, ఐటి కో-కోఆర్డినేటర్ రాజేష్, నాయకులు లక్ష్మి నారాయణ, జనర్దన్, నవాజ్, నరేష్, తెలుగుదేశం నాయకులు నాదెండ్ల విద్యాసాగర్, రాష్ట్ర తెలుగు యువత అధ్యక్షుడు శ్రీరామ్ చినబాబు, గంగారపు నవీన్ చౌదరి, రైతు ప్రధాన కార్యదర్శి మధుబాబు, అధికార ప్రతినిధి వెంకటేష్, చీకలబైలు సర్పంచ్ ప్రభాకర్, మాజీ సర్పంచుల సంగం అధ్యక్షులు పఠాన్ ఖాదర్‌ఖాన్, పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి దొరస్వామి నాయుడు, శ్రీరాములు, బిసి నాయకులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కిషోర్‌కుమార్‌రెడ్డి

26న చిత్రకళా ప్రదర్శన

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఈ నెల 26, 27వ తేదీలలో స్థానిక జిఎంసి కల్యాణ మంటపంలో చిత్రకళా ప్రదర్శన నిర్వహిస్తామని నిర్వాహకులు, ప్రముఖ చిత్రకారుడు నాయని గిరిధర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వివిధ రకాల ఆయిల్ పెయింటింగ్ చిత్రాలు ప్రదర్శిస్తామన్నారు. కార్యక్రమానికి ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, కలెక్టర్ గిరీష, జడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు మేడా వెంకట మల్లిఖార్జునరెడ్డి, కొరముట్ల శ్రీనివాసులు, గడికోట శ్రీకాంత్‌రెడ్డి, కడప మేయర్ సురేష్ బాబు, రాజంపేట మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులురెడ్డి, ఆర్‌డిఒ రామకృష్ణారెడ్డి, డిఎస్‌పి విఎంకె చైతన్య ముఖ్య అతిథులుగా పాల్గొంటారని పేర్కొన్నారు.

ఓటు నమోదుపై విద్యార్థులకు శిక్షణ

ప్రజాశక్తి-మదనపల్లె

స్థానిక మిట్స్ కళాశాల విద్యార్థులకు ఓటు నమోదుపై శిక్షణ ఇచ్చినట్లు డిప్యూటీ కలెక్టర్ రాఘవేంద్ర తెలిపారు. గురువారం మిట్స్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొబైల్‌ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకుని కూడా ఈ సేవలను పొందవచ్చన్నారు. బూత్ స్థాయి అధికారి, ఓటరు నమోదు అధికారిని కలసి సంబంధిత దరఖాస్తు ఫారాన్ని నింపి అందజేయాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో కురబలకోట తహశీల్దార్ భీమేశ్వర, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కమల్ బాషా, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రాజేష్ పాల్గొన్నారు.

డాక్టర్ యోగేష్‌బాబుకు ఎక్సలెన్సీ అవార్డు

ప్రజాశక్తి-పీలేరు

పీలేరుకు చెందిన డాక్టర్ టి.యోగేష్ బాబు యుఎఇలో ఎడ్యుకేషనల్ ఎక్సలెన్సీ పురస్కారం అందుకున్నారు. గురువారం ఆయన పీలేరులో మీడియాతో మాట్లాడుతూ ప్రస్తుతం ఇఆర్‌యు, యుఎస్ఎ, ఇఆర్‌సి, ఇండియాలో పోస్టు డాక్టరల్ ఫెలోగా తన రీసెర్చిని కొనసాగిస్తున్నానన్నారు. ఈ నెల 19, 20వ తేదీల్లో షార్జాలో జరిగిన యుఎఇ ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్‌లో టి.యోగేష్ బాబు బెస్ట్ డైనమిక్ ఎడ్యుకేషనలిస్ట్ ఇన్ ఫైన్ ఆర్ట్స్, జర్నలిజం, మాస్ కమ్యూనికేషన్స్ విభాగంలో "ఇండో మిడిల్ ఈస్ట్ ఎడ్యుకేషన్ ఎక్సలెన్స్ అవార్డు"ను అందుకున్నారు. ఇదే కార్యక్రమంలో ఆయన గెస్ట్ స్పీకర్‌గా ప్రసంగించడమే కాకుండా "ఇంపాక్ట్ ఆఫ్ అడ్వర్టైజింగ్ సిమోటిక్స్ ఆన్ ప్రొడక్ట్స్ ఇన్ ఎపి రీజియన్ ఇండియా" అనే రీసెర్చ్ ఆర్టికల్ ప్రజెంట్ చేశారు.

అవార్డు అందుకుంటున్న డాక్టర్ యోగేష్‌బాబు

వైద్యానికి ఆర్థిక సాయం అందించరూ..!

ప్రజాశక్తి-మదనపల్లె

నా బిడ్డ వైద్యానికి ఆర్థిక సాయం అందించండి దాతలకు బాధితుడు తండ్రి వేడుకున్నారు. తనబిడ్డ ఊపిరితిత్తులు పాడైపోయి, తీవ్ర అనారోగ్యంతో బెంగళూరు నగరం, వైట్ ఫీల్డ్ ఏస్తర్ ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్న తన కుమారుడు కె.వి.కిరణ్ కుమార్ వైద్యానికి ఆర్థిక సాయం అందించాలని మదనపల్లి పట్టణం మంజునాథ్ కాలనీకి చెందిన పి.ఆర్.వాసు దాతలను వేడుకున్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నేను కూలి పనులు చేసుకుంటున్నానని, తన కుమారుడు బిల్డింగ్ ఎలక్ట్రిషన్ పనిచేసుకుంటూ జీవనం సాగించేవాడన్నారు. ఇటీవల తన కుమారుడు జ్వరం బారిన పడి, తీవ్ర అస్వస్థతకు గురయ్యాడన్నారు.దీంతో తాము తిరుపతికి తీసుకెళ్లి వైద్యం చేయించగా వైరస్ కారణంగా ఊపిరితిత్తులు దెబ్బతిన్నాయని తెలిపారన్నారు. మెరుగైన వైద్యం కోసం బెంగళూరులోని ఏస్తర్ ఆసుపత్రిలో చేర్పించామన్నారు. ఇప్పటి వరకు రూ.22 లక్షలు వైద్యానికి ఖర్చుకాగా కేవలం రూ.9 లక్షలు మాత్రమే ఆసుపత్రికి చెల్లించామని, మిగిలిన రూ.13 లక్షల బిల్లులు ఇంకా చెల్లించాల్సి ఉందన్నారు. మరో వారం రోజులు పాటు ఆసుపత్రిలో ఉండాలని వైద్యం సూచించారన్నారు. ఇప్పటికే తన వద్ద ఉన్న డబ్బులే కాకుండా సాయంతో చికిత్స చేయించామన్నారు.ఇక చికిత్స చేయించడానికి తన దగ్గర స్తోమత లేదని ఆవేదన వ్యక్తం చేశారు.దాతలు స్పందించి తన కుమారుడి వైద్యానికి ఆర్థిక సాయం చేయాలని వేడుకున్నారు. ఎవరైనా సాయం చేయదలుచుకునే దాతలు మదనపల్లె బర్మా వీధి,స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అకౌంట్ నెంబర్ : 62262453698, ఐఎఫ్ఎస్‌సికోడ్ ఎస్‌బిఐఎన్ 0020901కుగానీ, 9000924458 అనే ఫోన్‌పే నెంబరుకిగాని నగదు పంపించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

మాట్లాడుతున్న బాధితుడు వాసు

ప్రకృతిని ప్రేమించండి : పిసిసి

ప్రజాశక్తి- రాయచోటి

ప్రతి ఒక్కరూ ప్రకృతిని ప్రేమించి పర్యావరణాన్ని రక్షించాలని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని విఆర్‌హై స్కూల్‌లో వన మహోత్సవ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రకృతిని మనం అందరం ప్రేమించాలని, పర్యావరణాన్ని రక్షించాలని పేర్కొన్నారు. అనంతరం విఆర్ విద్యాసంస్థల చైర్మన్ వి.ఆర్ రెడ్డి మాట్లాడుతూ పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు అని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి అని పేర్కన్నారు. అనంతరం ప్రిన్సిపల్ శివారెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఒక్కో మొక్క చెప్పున నాటాలి అని, నేటి మొక్కలే రేపటి మహా వృక్షాలు అవుతాయి అని అన్నారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో పెంచల్ రెడ్డి, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సంకల్ప యాత్రను విజయవంతం చేయండి

ప్రజాశక్తి -రాయచోటి

జిల్లాలో నిర్వహించబోయే వికసిత్ భారత్ సంకల్ప యాత్ర విజయవంతానికి తగిన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ గిరీష అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని విసి హాల్ నుంచి వికసిత్ భారత్ సంకల్పయాత్ర నిర్వహణపై సంబంధిత శాఖల అధికారులతో కలిసి మండల స్థాయి అధికారులతో వీడియో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వికసిత్ భారత్ సంకల్ప యాత్రను అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలలో నిర్వహించనున్నామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు అందచేస్తున్న సహాయం, సంక్షేమ పథకాల గురించి ప్రజలలో అవగాహన కల్పించడమే కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు అందిస్తున్న వివిధ పథకాల గురించి ప్రజలకు తెలియజేసే విధంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో బాధ్యతాయుతంగా కృషి చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు.

డ్రెయినేజీ పనులను పరిశీలిస్తున్న కమిషనర్

పారిశుధ్యానికి ప్రాధాన్యత : కమిషనర్

ప్రజాశక్తి-బి.కొత్తకోట

నగర పంచాయతీలో పారిశుధ్యాన్ని మెరుగుపరచి, డ్రెయినేజీ సమస్య పరిష్కారానికి ప్రత్యేక కృషి చేస్తున్నట్లు కమిషనర్ పి.ఆర్.మనోహర్ పేర్కొన్నారు. గురువారం ఎఇ రాజేంద్రతో కలిసి పట్టణంలోని దర్గావీధిరోడ్డు ప్రాంతాల్లో నెలకొన్న డ్రెయినేజీ సమస్యలను పరిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర పంచాయతీ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రధాన సమస్యల పరి ష్కారంపై దృష్టి సారించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూస్తున్నామన్నారు.ముఖ్యంగా మురుగునీటి కాలువల మరమ్మతులు, అసంపూర్తిగా మిగిలిపోయిన డ్రైనేజీలను నిర్మిస్తున్నామని తెలిపారు. పట్టణ ప్రజల ఆరోగ్యం, శ్రేయస్సుకు తొలి ప్రాధాన్యత మస్తు న్నామన్నారు. ప్రజలకు ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా నగర పంచా యతీ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. ప్రజలను సైతం భాగస్వాములు చేస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పిఎ మస్తాన్ పాల్గొన్నారు.

నేడు 'జగనన్నకు చెబుదాం'

ప్రజాశక్తి-బి.కొత్తకోట

కలెక్టర్ గిరీష ఆధ్వర్యంలో జగనన్నకు చెబుదాం ప్రజా ఫిర్యాదులు స్వీకరణ కార్యక్రమం పట్టణంలోని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ శంకరయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం 10 గంటలకు జిల్లా కలెక్టరు ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి అందరు జిల్లా స్థాయి అధికారులు మరియు మండల స్థాయి అధికారులు హాజరవు తారన్నారు. మండలంలోని ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగపరచుకొని తమ సమ స్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమానికి తమ వీలును బట్టి స్థానిక ఎమ్మెల్యే, మండల అధ్యక్షులు, జిల్లా ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు, మండల పరిషత్తు ప్రాదేశిక నియోజ కవర్గ సభ్యులు, కో-ఆప్షన్ మెంబర్, సర్పంచులు, వార్డుమెంబర్లు, సింగిల్‌విండో చైర్మన్, ఆర్‌బికె చైర్మన్, వైసిపి మండల అధ్యక్షులు, మండల ప్రజా ప్రతినిధులు, పంచాయితీ కార్యదర్శులు, విఆర్‌ఒలు, గ్రామ ఎఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, వాలంటీర్లు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

డీలర్ల సమావేశంలో మాట్లాడుతున్న డిటి ఉస్మాన్‌సాబ్

సకాలంలో రేషన్ పంపిణీ చేయాలి

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

చౌక దుకాణాల డీలర్లు సకాలంలో డిడిలు చెల్లించి రేషన్‌ను ప్రజలకు అందించాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డిటి ఉస్మాన్ సాబ్ పేర్కొన్నారు. గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో చౌక దుకాణాల డీలర్ల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బియ్యం, కందిపప్పు, చెక్కర సరుకులకు డిడిలు చెల్లించాలని, తీసుకెళ్ళిన సరుకులు 15వ తేదీలోపు లబ్ధిదారులకు అందించాలన్నారు. ఎండియు వాహనాల ద్వారా ప్రజలకు సక్రమంగా రేషన్‌బియ్యం సరుకులు అందించడం లేదని ఫిర్యాదులు వస్తున్నా యని, కచ్చితంగా గ్రామాలకు వెళ్లి లబ్ధిదారులకు బియ్యాన్ని అందించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో చౌక దుకాణాల డీలర్లు పాల్గొన్నారు.



చమర్తి జగన్మోహన్‌రాజును సన్మానిస్తున్న గ్రామస్తులు

ఆలయ అభివృద్ధికి కృషి :'చమర్తి'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మండలం పరిధిలోని కూచివారిపల్లె గ్రామపంచాయతీ ధన్నాసిపల్లె గ్రామ ప్రజల ఆహ్వానం మేరకు టిడిపి రాజంపేట పార్లమెంటు అధ్యక్షులు చమర్తి జగన్మోహన్‌రాజు గురువారం గ్రామంలో పర్యటించారు. గ్రామంలోని అంకాలమ్మ ఆలయాన్ని దర్శించి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. మరోసారి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మోసపూరిత మాటలు నమ్మి మోసపోవద్దని, రాష్ట్ర అభివృద్ధి చంద్రబాబు తోనే సాధ్యమని అన్నారు. బాబు షూరిటీ-భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమంతో మనందరి జీవి తాలలో చంద్రబాబు వెలుగులు నింపుతారని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి కొవ్వూరు సుబ్రహ్మణ్యంనాయుడు, ముళ్లగూరి సుబ్ర హ్మణ్యం, పతకమూరి శంకరయ్య, ముళ్ళ గూరి ఆంజనేయులు, నాగినేని నవీన్, నంబూరు రాజశేఖర్, గొల్లపూటి మహేంద్ర, ఎంపిటిసి కేశవ, మండ లాధ్యక్షుడు సతీష్‌రాజు, జి.వి.సుబ్బరాజు, సూర్యనారా యణ, పట్టణ తెలుగుయువత ప్రధాన కార్యదర్శి సుహేల్, నాగేంద్ర, వెంకటేష్ యాదవ్, రామ్మోహన్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

మండలంలోని మల్లెల గురుకుల పాఠశాలలో మానవత ఆధ్వర్యంలో పి.వి.రాఘవరెడ్డి సౌజన్యంతో 2022-23 విద్యా సంవత్సరంలో సీనియర్ ఇంటర్ చదువుతున్న మునిచరణ్ రూ.1000, రాఘవేంద్ర నాయక్ రూ.1000, జూనియర్ ఇంటర్ మురళీకృష్ణకు రూ.500, మురగేష్ రూ.500, 10వ తరగతి భరత్‌కుమార్ రూ.500, హర్షవర్ధన్లకు రూ.500ల చొప్పున మొత్తం రూ.40వేలు నగదు ప్రోత్సాహక బహుమతులను అందించారని తెలిపారు. ఈ సందర్భంగా దాత పి.వి.రాఘవరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను చక్కగా అవగాహన చేసుకుని, సన్మార్గంలో నడిచి మెరుగైన ఫలితాలతో పాటు, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.విద్యార్థులు చదువును కష్టపడకుండా ఇష్టంతో చదవాలని సూచించారు. ఉన్నత విద్యను అభ్యసించి తల్లిదండ్రులకు, గురువులకు మంచి పేరు తీసుకరావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ కోటేశ్వరరావు, వైస్ ప్రిన్సిపల్ వాసుదేవరావు, మానవత ఎన్.క్రిష్ణారెడ్డి, జి.రామచంద్రా రెడ్డి, ఆదిత్య డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపల్ యల్.ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రోత్సాహక బహుమతులు అందుకున్న విద్యార్థులతో మానవత సభ్యులు

సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లు : 'గడికోట'

ప్రజాశక్తి-రామాపురం

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలం నల్లగుట్టపల్లెలో నిర్వహించిన వైనీడ్స్ ఎపి జగన్ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. నల్లగుట్టపల్లె సచివాలయ పరిధిలో వివిధ పథకాల ద్వారా జరిగిన అభివృద్ధిని తెలిపే బోర్డ్‌ను శ్రీకాంత్‌రెడ్డి ప్రారంభించి ఏఏ పథకం ద్వారా ఎంతమేలు జరిగిందో ప్రజలకు వివ రించారు. 45 ఏళ్ళు దాటిన అక్కాచెల్లెమ్మలకు ఏటా రూ.18,750 అందు తోందన్నారు. చంద్రబాబు పాలనలో డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తామని చెప్పి అక్క చెల్లెమ్మలను మోసగించారన్నారు. జగన్ నాలుగన్నరేళ్ల పాలనలో మూడుసార్లు డ్వాక్రా రుణమాఫీ, నాలుగు సార్లు అమ్మఒడి, మూడు సార్లు చేయూత, పాఠశాలల అభివృద్ధి, రాయచోటి పట్టణంలో నాలుగు అర్బన్ హెల్త్ సెంటర్లు, వంద పడకల ఆస్పత్రి, రైతుబజార్, బస్‌స్టాండ్ విస్తరణ, రహదారుల విస్తరణ, శిల్పారామం, నగరవనం, తదితర అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి గడికోట జనార్దన్‌రెడ్డి, జడ్‌పిటిసి మాసన వెంకట రమణ, మార్కెట్ కమిటీ చైర్మన్ కర్ణపు విశ్వనాథరెడ్డి, స్థానిక సర్పంచ్ నాగ భూషన్‌రెడ్డి, యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూరంవెంకట సుబ్బారెడ్డి, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ ఆంజనేయులు, వైస్ ఎంపిపిలు రవి శంకర్‌రెడ్డి, బాబు, సింగల్ విండో అధ్యక్షులు పెద్దిరెడ్డి, ఆదినారాయ ణరెడ్డి, సత్యాయాదవ్, శ్రీధర్‌రెడ్డి, ఆంజనే యులు పాల్గొన్నారు. **రామసముద్రం :** మండలంలోని ఎలువనెల్లూరు పంచాయతీ కేంద్రంలో సర్పంచి ఉదయ్ శంకర్ రెడ్డి ఆధ్వర్యంలో వై నీడ్ ఎపి జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఎలువనెల్లూరు గ్రామ పంచాయతీకి నాలుగున్నర సంవత్సరాల కాలంలో దాదాపు 24 కోట్లు రూపాయలు సంక్షేమ పథకాలు రూపంలో అందా యని అన్నారు. పైగడ్డ నుండి పిల్లిగుండ్లపల్లి వరకు, గజ్జిగంగనపల్లి వరకు రోడ్లు పూర్తి చేసామని తెలిపారు. తర్వాత కోటి రూపాయల పైనే గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లకు కోటి రూపాయల పైనే ఖర్చు చేశామన్నారు. కార్యక్రమంలో ఈఒఆర్డి సుధాకర్ రెడ్డి, ఎంపిపి కుసుమ కుమారి, జడ్పిటిసి

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి

సిహెచ్ రామచంద్రా రెడ్డి, ఎంపీటీసీ మూగవాడి రెడ్డెప్ప, రెడ్డి శేఖర్, మాజీ ఎంపిటిసి దొడ్డిపల్లె ఆనంద, ఈశ్వర్ , మాజీ సర్పంచ్ కత్తి వాలెప్ప, సిహెచ్ ప్రకాష్ , ఎస్ సి సెల్ క్రిష్ణప్ప, కేశవ పాల్గొన్నారు. **వీరబల్లి :** ముఖ్య మంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సచివాలయ వాలంటీర్ వ్యవస్థతో పేదల ఇంటా సంక్షేమ కాంతులు వెల్లి విరుస్తున్నాయని ఎంపిపి రాజేంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం వీరబల్లి పంచాయతీలో వై ఎపి నీడ్స్ జగన్ కార్యక్ర మాన్ని నిర్వహించారు. వైసిపి నాయకులతో కలిసి సంక్షేమ అభివృద్ధి బోర్డును ఆవిష్కరించారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి శివరాంగౌడ్, ఎంపిడిఒ మల్లేశ్వరి, వైసిపి యువనాయకుడు వీరనాగిరెడ్డి, జెసిఎస్ కన్వీనర్ నరేష్, పంచాయతీ సెక్రటరీ చంద్రుడు, ఎస్‌సి సెల్ రామ, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు. **చిన్నమండెం:** మండలంలోని టి.సాకిబండ గ్రామ సచివాలయంలో గురువారం ఆంధ్రాకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో పథకాల బోర్డు పార్టీ నాయకులు ఆవిష్కరించారు. కార్యక్ర మంలోఎంపిటిసి రత్నమ్మ, మాజీ ఎంపిటిసి వెంకట్రామిరెడ్డి, వైసిపి నాయ కులు మహమ్మద్ షరీఫ్, సాయిపీర్, ప్రతాప్‌రెడ్డి, జెసిఎస్ మండల కన్వీనర్ చుక్కఅంజనప్ప, శ్రీరాములు, రమంజులు రెడ్డి,ఫయాజ్, సత్యం పాల్గొన్నారు.

బిసి సమావేశాన్ని జయప్రదం చేయండి : టిడిపి

సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి మండల కన్వీనర్ సిద్ధ

ప్రజాశక్తి-ములకలచెరువు

బిసిలకు నమ్మకద్రోహం చేసిన వైసిపిని గద్దె దించాలని మండల కన్వీనర్ పాలగిరి సిద్ధ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ములకల చెరువులో టిడిపి నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మదనపల్లెలోని ఎన్‌టిఆర్ కల్యాణ మండపంలో శుక్ర వారం జరిగే బిసి విభాగం అఖిల పక్ష రౌండ్ టేబుల్ సమావేశాన్ని జయప్రదం చేయాలన్నారు. నాలుగున్నరేళ్ల వైసిపి ప్రభుత్వ పాలనలో బిసి సామాజిక వర్గ ప్రజలపై అన్యాయాలు, దాడులపై రౌండ్ టేబుల్ సమావేశంలో చర్చిస్తామ న్నారు. సమావేశంలో నాయకులు కెవి రమణ, బషీర్, సోముసేఖర్, నియోజక వర్గ బిసిసంఘం అధ్యక్షుడు చెన్న కృష్ణ, జిల్లా నాయిబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు కేశవులు పాల్గొన్నారు.

అతిసార ప్రబలకుండా చర్యలు : ఎంపిడిఒ

ప్రజాశక్తి-పెద్దమండెం

మండల పరిధిలోని తుసవారిపల్లిలో అతిసార ప్రబలకుండా చర్యలు తీసుకుంటున్నామని ఎంపిడిఒ శ్రీధర్ పేర్కొన్నారు. గురువారం అతిసార ప్రబలిన గ్రామాన్ని అధికారులు, వైద్యసిబ్బంది పరిశీలించారు. అతిసార విజృంభించి గత వారం రోజులుగా ఇద్దరు మృతి చెందారని తెలిపారు. మరో పది మంది బెంగళూరు, తిరుపతి, మదనపల్లి ఆస్పత్రులలో చికిత్సలు పొందుతున్నారు. మద్దెమ్మ, సుబ్బమ్మ మృతి చెందగా రెడ్డప్ప, లక్ష్మమ్మ, రమణయ్య ఆసుపత్రులలో చికిత్సలు పొందుతున్నట్లు తెలిపారు. తాగునీరు కలుషితం లేకా జంతు మాంసం తినడం వల్ల అతిసార ప్రబలిందా అనే దానిపై విచారణలో తేలుతుందన్నారు. పైప్‌లైన్ ద్వారా సరఫరా అయ్యే తాగు నీరు కలుషితమయ్యే చోట మరమ్మతులు చేపట్టినట్లు తెలిపారు. తాగునీటి శాంపుల్స్‌ను టెస్టింగ్‌కు ల్యాబ్‌కు పంపినట్లు ఆర్డబ్ల్యూఎస్ జెఇ హరి తెలిపారు. రిపోర్ట్స్ వచ్చేవరకు బోరునీరు తాగవద్దని ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తామని ప్రజలకు తెలిపారు. జంతు మాంసం కూడా తినకూడదని తెలి

గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎంపిడిఒ శ్రీధర్

పారు. గ్రామంలో పారిశుధ్యం పనులు చేపట్టి దోమల నివారణకు బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసి వైద్యసేవలు అందించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది, పంచాయతీ అధికారులు, పాల్గొన్నారు.

అభ్యసనాభివృద్ధిపై ఉపాధ్యాయులకు శిక్షణ

శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఇఒలు

ప్రజాశక్తి-పీలేరు

విద్యార్థుల్లో అభ్యసనాభివృద్ధిని పెంపొందించడానికి శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఎంఇఒలు లోకేశ్వర్‌రెడ్డి, రెడ్డిబాషా తెలిపారు. గురువారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అభ్యసనాభివృద్ధి కార్యక్రమంపై తెలుగు, ఇంగ్లీష్, గణితం, సైన్స్, సోషియల్ సబ్జెక్టుల ఉపాధ్యాయులకు మూడవ రోజు శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ శిక్షణా కార్యక్రమానికి పరిశీలికులుగా పీలేరు, కె.విపల్లి ఎంఇఒలు లోకేశ్వర్‌రెడ్డి, పి.రెడ్డి బాషా, కోర్స్ డైరెక్టర్‌గా వి.జి నటరాజన్ వ్యవహరించారు. ఈ సందర్భంగా శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ కనీస అభ్యసనా స్థాయిని విద్యార్థుల్లో అభివృద్ధి చేయడం, బోధన పీరియడ్స్‌తో పాటు సాధన పిరియడ్స్‌ను కేటాయించడం, బాషా నైపుణ్యాలను పెంపొందించడం, అహ్లాదకరమైన వాతావరణం కల్పించడం ఈ శిక్షణ ఉద్దేశమని అన్నారు. ఉపాధ్యాయులు శిక్షణలో నేర్చుకున్న విషయాలను పాఠశాలస్థాయిలో విద్యార్థుల అభ్యాసన మెరుగు పరిచేందుకు పకడ్బందీగా అమలు చేస్తేనే ఈ శిక్షణకు సార్ధకత అన్నారు. విద్యార్థుల్లో అభ్యాసన పేదరి కాన్ని రూపుమాపినప్పుడే విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచవచ్చుని సూచించారు. లిప్(లర్నింగ్ ఇంప్రూవ్మెంట్ ప్రోగ్రాం) కార్యక్రమం ప్రస్తుతం ప్రయోగాత్మకంగా పది జిల్లాల్లో జరుగుతున్నట్లు తెలిపారు. 2027 సంవత్సరం వరకు కొనసాగుతుందని అన్నారు. కార్యక్రమంలో రాజన్న, వాణిశ్రీ (తెలుగు), ప్యారుఖాన్, కృష్ణయ్య (ఇంగ్లీష్), రెడ్డి ఆంజనేయులు, ఎ.కృష్ణవేణి(మాథ్స్), సుధాకర్, శివశంకరయ్య (జీవ శాస్త్రం), వెంకట శివయ్య (భౌతిక శాస్త్రం), నారాయణ, ముని వెంకట్రామయ్య(సోషియల్) రిసోర్స్ పర్సన్స్ గా పాల్గొని శిక్షణ ఇచ్చారు. పీలేరు, కె.వి పల్లి మండలాల ప్రభుత్వ, జిల్లా పరిషత్, గురుకుల, ఆదర్శ పాఠశాలల నుండి తెలుగు, ఇంగ్లీష్, లెక్కలు, సైన్స్, సోషియల్ సబ్జెక్టుల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వీధి కుక్కలు పట్టివేత

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లెలోని ఆయా ప్రాంతాల్లో ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్న వీధి కుక్కలను పంచాయతీ ఆధ్వర్యంలో పట్టేశారు. ఇటీవల కుక్కల కాటుకు పలువురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ నేపథ్యంలో ప్రజలు, ప్రజాప్రతినిధులు గ్రామంలో ఉన్న కుక్కలను పట్టి వేయాలని కోరారు. ఆ మేరకు గురువారం వేంపల్లెలోని ఆయా ప్రాంతాల్లో ఉన్న వీధి కుక్కలను పట్టి దూర ప్రాంతాలకు తరలించారు. పంచాయతీ అధికారులు వీధి కుక్కలను పట్టి వేయడంతో ఆయా ప్రాంతాల్లో ఉన్న ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చింతలమడుగుపల్లె, మదీనాపురం, ఫక్కీర్‌పల్లె, గండి రోడ్డు, నాలుగు రోడ్ల కూడలి, కడప రోడ్డు, శ్రీచైతన్య, పిరమిడ్ నగర్ ప్రాంతాల్లో ఉన్న వీధి కుక్కలను పట్టారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి సుబ్బారెడ్డి మాట్లాడుతూ కుక్కల వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులను చూసి సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు ఆదేశాల మేరకు గ్రామంలో ఉన్న కుక్కలను పట్టి వేసి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నట్లు చెప్పారు. ఇటీవల కూడా కుక్కలను పట్టి దూర ప్రాంతంలో విడిచి పెట్టినట్లు చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుబ్బారెడ్డి, పారిశుధ్య మేస్త్రీలు అల్లాబకష్, సిబ్బంది పాల్గొన్నారు.

సహాయ పరికరాలు మంజూరు

ప్రజాశక్తి - వేంపల్లె

మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న విభిన్న ప్రతిభావంతులు 56మందికి సహాయ పరికరాలు మజ్ఞూరైనట్లు జడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గతేడాది సెప్టెంబర్‌లో వేంపల్లె జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో అలింకో ఢిల్లీ వైద్య నిపుణులచే 300 మంది విభిన్న ప్రతిభావంతులు ఉపకరణాల కోసం ఉచిత వైద్య పరీక్షలు చేసినట్లు చెప్పారు. వీరిలో 56మందికి రూ.3.50 లక్షల విలువ చేసే వీల్ ఛైర్స్, వాకింగ్ స్టిక్స్, స్మార్ట్ ఫోన్స్, వినికిడి యంత్రాలు, సిపి ఛైర్లుకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. ఈనెల 29న పులివెందులలోని అహోబిలంపురం ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలలో విభిన్న ప్రతిభావంతులకు సహాయ పరికరాలు ఎంపీ అవినాష్‌రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అర్హులైన విభిన్నప్రతిభావంతులు తప్పక హాజరుకావాలని జడ్పీటిసి కోరారు.

ఘనంగా శ్రీగౌరీదేవి కార్తీక మహోత్సవాలు

ప్రజాశక్తి - వేంపల్లె

పట్టణంలో వెలసిన శ్రీగౌరీదేవి ఆలయంలో బలిజ సంఘం ఆధ్వర్యంలో గురువారం కార్తీకమాసం మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయని బలిజ సంఘం అధ్యక్షులు నంబూరు కులాయప్ప, కటిక చంద్రశేఖర్ తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజు గౌరీదేవి వివిధ దేవతా అవతారంలో దర్శనమిస్తారని తెలిపారు. అర్చకులు శంకరమంచి ప్రసాద్ శర్మ నేతృత్వంలో గౌరీదేవికి భక్తిశ్రద్ధలతో అభిషేకం నిర్వహించామన్నారు. ఉత్స వాల్లో ప్రతిరోజు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేంపల్లె మండల ప్రజలు గౌరీదేవిని దర్శించుకుని ఆశీస్సులు పొందాలని కోరారు.

ప్రారంభానికి ప్రభుత్వ భవనాలు సిద్ధం

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని మడూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయం, ఆర్‌బికె, హెల్త్ క్లినిక్ భవనాలు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నట్లు పంచాయతీరాజ్ ఎఇ ఈశ్వరయ్య తెలిపారు. సచివాలయ భవనం రూ.40 లక్షలు, వైయస్సార్ హెల్త్ క్లినిక్ రూ.20.80 లక్షలు, ఆర్‌బికె రూ.21.80 లక్షలతో నిర్మించామన్నారు. వీటిని ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి త్వరలో ప్రారం భిస్తారని పేర్కొన్నారు. నూతన భవనాలు ప్రారంభిస్తే ప్రజలకు అందుబాటులోకి వస్తే సౌకర్యవంతగా ఉంటాయని తెలిపారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

చాపాడు : అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎంపిపి టి.లక్షుమయ్య తెలిపారు. మండల పరిధిలోని పెద్దగురువలూరు గ్రామంలో గురువారం ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని సచివాలయంలో నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఎంపిపి మాట్లాడుతూ పెద్దగురువలూరు సచివాలయ పరిధిలో అభివృద్ధి, సంక్షేమానికి రూ.18కోట్లు వినియోగించారని తెలిపారు. గ్రామంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ రాధాకృష్ణవేణి, సర్పంచ్ రాజేష్‌కుమార్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది, సచివాలయ కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు, వాలంటీర్లు పాల్గొన్నారు. **పులివెందుల రూరల్ :** ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని మున్సిపల్ వైసిపి ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, రాష్ట్ర సివిల్ సప్లయ్ డైరెక్టర్ గంగాధం రెడ్డి, జెసిఎస్ ఇన్‌ఛార్జిలు పార్నపల్లి కిషోర్, చంద్రమౌళి తెలిపారు. తహశీల్దార్ కార్యాలయం సమీపంలో ఉన్న సీయోనుపురం సచివాలయంలో గురువారం రాష్ట్రానికి జగన్ ఎందుకు కావాలి అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వైసిపి నాయకుడు కడియాల లక్ష్మీనారాయణ, వైస్ చైర్మన్ హాఫీజ్, కౌన్సిలర్ ఖాదర్‌బాషా, వైయస్సార్ చారిటబుల్ ట్రస్ట్ యజమాని వీరారెడ్డి, రవి, శ్రీరాములు, సిద్దయ్య, సంపత్, ఫైర్ రామకృష్ణ, నాగరాజు, సచివాలయ ఉద్యోగులు వాలంటీర్లు పాల్గొన్నారు

మాట్లాడుతున్న ఎంపిడిఒ మల్లీశ్వరి

మహిళా సంఘాలు బలోపేతమవ్వాలి

ప్రజాశక్తి-వీరబల్లి

మహిళా సంఘాలు బలోపేతం అవ్వాలని మండల అభివృద్ధి అధికారి మల్లీశ్వరి పేర్కొన్నారు. బుధవారం స్థానిక వైఎస్ఆర్‌క్రాంతి పథం కార్యాలయంలో జరిగిన మండల సమాఖ్య కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. పొదుపు సంఘాల ద్వారా పేదరికం క్రమేణా తగ్గుచున్నట్లు గణాంకాలు తెలియజేయడం చాలా సంతోషించదగ్గ విషయమన్నారు.తీసుకున్న రుణాలు సక్రమంగా చెల్లించి పెద్ద మొత్తంలో రుణాలు తీసుకో వాలని సూచించారు. మహిళా సంఘాల సమావేశాల్లో బాల్యవివాహాలపై చర్చించాలన్నారు.ఏరియా కో-ఆర్డి నేటర్ శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ తీసుకొన్న రుణాలను సక్రమంగా చెల్లిం చేలా సిబ్బంది బాధ్యత తీసుకో వాలని, ఎప్పటికప్పుడు బకాయిపడ్డ సంఘాలతో సమావేశమై చర్చించాలన్నారు. సమాఖ్య సమావేశాల్లో ఆర్థిక లావాదేవీలపై పదాధికారులకు సంపూర్ణ అవగాహన ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎపియం ఖాదంవలి, స్త్రీనిధి మేనేజర్ హరీష్, మండలసమాఖ్య అధ్యక్షురాలు లక్ష్మీదేవి, కార్యదర్శి లలిత, ఆధిలక్షుమ్మ పాల్గొన్నారు.

ఆలయానికి రూ.1.50 లక్షలు విరాళం

చిన్నమండెం : మండలంలోని వండాడి గ్రామం కదిరివాండ్లపల్లెకు చెందిన ఎన్‌ఆర్‌ఐ చింతం వెంకట్రామిరెడ్డి మల్లురమ్మ గుడి నిర్మాణం కోసం 1.50 లక్షయాబై వేల రూపాయలు విరాళం అందజేశారు.డబ్బులు అందజేస్తున్న వైసీపీ నాయకుడు కదిరి. రంగా రెడ్డి ఈ కార్యక్రమంలో సర్పంచులు ముసల్ రెడ్డి,లక్ష్మీ రెడ్డి,కాంట్రాక్టు ర్ సహదేవా రెడ్డి తదితరులు పాల్గొన్నారు

ఐస్‌క్రీమ్ పార్లర్ ప్రారంభం

కలకడ : స్థానిక ఎంపిపి శ్రీదేవి రవికుమార్ చేతుల మీదుగా ఐస్‌క్రీం పార్లర్‌ను ప్రారంభించినట్లు నిర్వాహకులు వెంకటరెడ్డి తెలిపారు. స్థానిక యూనియన్ బ్యాంకు ఎదురుగా చిత్తూరు- కర్నూలు జాతీయ రహదారిపై ఈ పార్లర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ వెంకట్ రమణారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఐస్‌క్రీం పార్లర్‌ను ప్రారంభిస్తున్న ఎంపిపి శ్రీదేవిరవికుమార్

క్రైం కార్నర్

ముగ్గురు పేకాటరాయుళ్లు అరెస్టు

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. గురువారం ఉదయం మండలంలోని రెడ్డివారిపల్లి పంచాయతీ సోమానుపల్లి కాలనీ సమీపంలో డబ్బులను పందెంగా కాస్తూ లోపల బయట జూదం ఆడుతున్నట్లు సమాచారం అందడంతో దాడులు చేశామన్నారు. ఈ దాడిలో జూదం ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.4,100 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేశామని ఎస్ఐ అన్నారు.

దాడికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు

ప్రజాశక్తి-కలకడ

దాడికి పాల్పడి యువకుడిని గాయపరిచిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని కె.బాటవారిపల్లె పంచాయతీ పోతువారి పల్లిలో నివాస మున్న కాపురస్తుపల్లెనేని స్వామికొండ తన ఇంటి ముందు కూర్చుని ఉండగా అదే సమయంలో ఆ దారిలో వెళుతున్న పరిటాల పూర్ణచంద్రనాయుడు అలి యాస్ పూర్ణ అనే వ్యక్తి దారిలో పోతూ స్వామికొండతో నీభార్య పుట్టింటికి వెళ్లి 20 రోజులు అవుతున్నా చేతగాని వ్యక్తిగా వ్యవహ రిస్తున్నావని హేళకరంగా మాట్లాడారని తెలిపారు. స్వామికొండ అలా మాట్లాడవద్దని చెబుతుండగా పూర్ణచంద్ర నాయుడు దాడికి పాల్పడి గాయపరిచాడని చెప్పారు. స్థానికులు పూర్ణ చంద్రను అడ్డుకొని గాయపడిన వ్యక్తిని పీలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు.ఈ ఘటనపై స్వామికొండ తల్లి పల్లెనేని సుశీల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆర్‌టిసి డ్రైవర్ హత్య కేసులో నిందితులు అరెస్టు

ప్రజాశక్తి-కలికిరి

ఆర్‌టిసి డ్రైవర్ హత్య కేసులో నిందితులు అరెస్టు చేసినట్లు సిఐ సురేష్ కుమార్, ఎస్ఐ రహిముల్లా తెలిపారు. పోలీసులు కథనం మేరకు.. మండలం లోని గుట్టపాలెం పంచాయతీ, నల్లగుట్ట దళితవాడకు చెందిన ఆర్‌టిసి డ్రైవర్ సాలిరవి కుమారుడు హేమంత్ తన కుమార్తె హర్షిత మృతికి కారణమనే అనుమానముతో, పీలేరు ఆర్‌టిసి డిపోలో మెకానిక్‌గా పనిచేసే ఆనంద, అతని బామర్ది అంజనేయులు భార్య లక్ష్మీదేవి, లీలావతితో కలిసి కుట్ర పన్ని ప్రస్తుతం హేమంత్ చింతామణి జైలులో వున్నందున, అతని తండ్రి రవిని అంతమొందించాలని పలుమార్లు ప్రయత్నించారని తెలిపారు. నవంబర్ 13 తేదీన ఉదయం 9.10 గంటలపుడు రవి తన ద్విచక్ర వాహనం పై నల్లగుట్ట హరిజనవాడ నుంచి డ్యూటి కి వెళ్ళుటకు కలికిరికి వస్తూండగా వూరికి సమీపములో లక్ష్మయ్య బొప్పాయి తోట వద్ద ఆటోలో కాపు కాసిన ఆనంద, అతని బామ్మర్ది అంజనేయులు డ్రైవర్ రవి అక్కడికి రాగానే అడ్డుకొని, వెనుక వైపు నుండి ఆనంద ఇనుప రాడ్డుతో రవి తల వెనుక బలంగా కొట్టడముతో క్రింద పడిపోగా, వెంటనే ఇద్దరు కలిసి రవిని చనిపోయేదాకా రాడ్లతో అతని తలపై బలముగా చితకబాది, శవాన్ని ఆటోలో వేసుకొని వెళ్ళి, రవికి చెందిన బ్యాగు, హత్యకు ఉపయోగించిన రెండు రాడ్లను అగ్రహారం వెళ్ళే రోడ్డులో గార్గేయనదిలో పారవేసి, మృతదేహాన్ని రైలు ట్రాక్ పై పడవేసి ఆత్మహత్య గా చిత్రీకరించడానికి ప్రయత్నించారని చెప్పారు. శవాన్ని అదే రోజు రాత్రి రైలు తొక్కించుకొని వెళ్లడంతో కదిరి రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి రైల్వేపోలీసు సిఐ డి.నాగరాజు పరిశీలించి అది హత్యగా తెలపడంతో కలికిరి పోలీసులకు ఉన్నతాధికారుల ద్వారా కేసు అప్పగించారని అన్నారు. ఎస్‌పి బి.కృష్ణారావు, రాయచోటి డిఎస్‌పి మహబూబ్‌బాషా ఆదేశాల మేరకు సత్వరమే కేసును చేంచి, తమ సిబ్బంది ఎఎస్ఐ మదుసూదనాచారి, మహమ్మద్‌అలీ, రవిశేఖర్ (టెక్నికల్ వింగ్), మణిరత్నం, నాగరాజు, సతీష్, అబ్దుల్లా, అమరనాథ్, జిలానీ, తేజోవతి, హోంగార్డులు నిజా ముద్దీన్, ప్రతాప్‌రెడ్డిలతో కలికిరి-పీలేరు రోడ్డు నందు అంకాలమ్మ గుడి వద్ద కాపుకాచి మదనపల్లె వైపు పారిపోతున్న నిందితులను అరెస్టు చేసి, హత్యకు ఉపయోగించిన రాడ్లను, ఆటోను సీజ్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. కేసును వాయల్పాడు సిఐ సురేష్‌కుమార్ దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

నిందితుల అరెస్టును చూపుతున్న పోలీసులు